క్లుప్తంగా

ముగిసిన కబడ్డీ పోటీలు



విజేతలతో నాయకులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని వెర్రబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న కబడ్డీ క్రీడా పోటీలు ఆదివారం ముగిసాయి. 52జట్లు పోటీల్లో పాల్గొనగా, ఫైనల్లో అంకతిపల్లి గ్రామానికి చెందిన జట్టు ప్రథమ స్థానం, దండేపల్లి మండలం కన్నెపల్లికి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు ఫౌండేషన్ చైర్మన్ రఘునాథ్ బహుమతులు అందజేశారు.

వైభవంగా సుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

చెన్నూర్: పట్టణంలోని జగన్నాథాలయంలో ధనుర్మాసం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నృసింహ సుదర్శన హోమాన్ని ఆలయ అర్చకులు మోహనాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సోమవారం సాయంత్రం గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు అనిలాచార్యులు, అజయ్‌చార్యులు, అరుణాచార్యులు భక్తులు పాల్గొన్నారు.

'రిపోర్టర్ హత్యపై ఖండన'

శ్రీరాంపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తార్‌లో యూట్యూబ్ రిపోర్టర్ ముఖేష్‌చంద్రకర్‌ను హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవి సత్యం, నాయకులు నీరటి రాజయ్య, గుంపుల సారయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది ముమ్మాటికి బీజేపీ ప్రభుత్వ ప్రోద్బలంతో మతోన్మాదులు చేసిన హత్యనే అన్నారు. ఇందులో దోషులను గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

'అలిశెట్టి'కి నివాళి



నివాళులర్పిస్తున్న కవులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక అమరవీరుల స్తూపం వద్ద ఆదివారం అలిశెట్టి ప్రభాకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అలిశెట్టి చిత్రపటానికి కవులు, రచయితలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అతడి సాహిత్యం, జీవితాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కవులు ముత్యం నాగవర్మ, శ్రీమన్నారాయణ, శ్రీనివాస్, పెద్ది భరత్, లక్ష్మారెడ్డి, సాహిత్యాభిమానులు ఇబ్రహీం, కొండయ్య, దేవి సత్యం, జైపాల్‌సింగ్, కమల్, జయరావు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం



ఉద్యోగాలు సాధించిన వారితో నాయకులు

దండేపల్లి: ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన మున్నూరుకాపు యువతీ, యువకులు విధుల్లో సమాజ శ్రేయస్సుకు కృషి చేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని, మున్నూరుకాపు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంఘం దండేపల్లి మండలం అధ్యక్ష, కార్యదర్శులు రాజన్న, శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పలువురు మున్నూరు కాపు యువతీ, యువకులను సంఘం ఆధ్వర్యంలో ఆదివా రం ఘనంగా సన్మానించారు. ఉద్యోగులు తమవంతుగా సమాజ సేవ చేయాలన్నా రు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జనార్దన్, నాయకులు కుంచె కిషన్, సత్యనారాయణ, గంగన్న, శేఖర్, సుగుణాకర్, సత్తయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు అందజేత

లక్సెట్టిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని సామాజిక సేవా కార్యక్రమాలు చేసినందుకు లక్సెట్టిపేట మండలంలోని శాంతాపూర్‌కు చెందిన లింగంపల్లి వెంకటేష్‌కు సామాజిక సేవా పురస్కారం, జిల్లా ఐడీఓసీలో నిర్వహించిన వేడుకల్లో హాజీపూర్ మండలానికి చెందిన యువరాజ్యం స్వచ్ఛంధ సేవా సంస్థకు జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి కీర్తి రాజ్‌వీరు ఉత్తమ సేవా పురస్కారం అందజేశారు.

వివేకానందుడు యువతకు స్ఫూర్తి

- ఘనంగా వివేకానంద జయంతి
- పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు



దండేపల్లి: జయంతిలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్



జన్నారం: స్నేహయూత్ ఆధ్వర్యంలో నివాళులు



బెల్లంపల్లి: శ్రద్ధాంజలి ఘటిస్తున్న బీజేపీ శ్రేణులు

దండేపల్లి: స్వామి వివేకానందను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని, అన్ని రంగాల్లో రాణించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ సూచించారు. ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. మండలంలోని రెబ్బనపల్లిలో వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిరుపేద కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశారు. విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

మంచిర్యాలటౌన్: స్వామి వివేకానంద జీవిత చరిత్రను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో వివేకానంద విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అమిరిశెట్టి రాజ్‌కుమార్, రజనీశ్ జైన్, పెద్దపల్లి పురుషోత్తం, తుల ఆంజనేయులు, జోగుల శ్రీదేవి, బియ్యాల సతీశ్, బోయిని హరికృష్ణ, వైద్య శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్: చెన్నూర్ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి వివేకానంద చిత్రపటానికి పూల మాలలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేవీఎం శ్రీనివాస్, బొజ్జ పోచన్న, అడప శ్రీనివాస్, తుమ్మ శ్రీపాల్, మానికరావు శంకర్, కాయిత రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏఎంసీ ఏరియాలో స్వామి వివేకానంద విగ్రహానికి బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, పట్టణ బీజేపీ అధ్యక్షురాలు దార కళ్యాణి, కార్యదర్శి సుమలత, సాగర్, ప్రశాంత్ పూలమాలలు వేసి అంజలి ఘటించారు. శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో పూర్వ విద్యార్థి పరిషత్ ప్రబంధ కారిణి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

భీమారం: మండలకేంద్రంలోని ఆవిడం ఎక్స్ రోడ్డు వద్ద వివేకానంద చిత్రపటానికి యువకులు రేషవేని శ్రీనివాస్, మెండె మల్లేశ్, కొక్కుల నరేశ్ పూలమాలవేసి నివాళులర్పించారు.

జన్నారం: మండల కేంద్రంలో స్నేహయూత్, హిందూ వాహిని ఆధ్వర్యంలో వేర్వేరుగా స్వామి వివేకానందకు నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు దుమల్ల రమేశ్, ఉపాధ్యక్షుడు రాజలింగం, ప్రధాన కార్యదర్శి సుధాకర్ నాయకులు పాల్గొన్నారు.

నస్పూర్: సీసీసీ కార్నర్ వద్ద ఆదివారం వివేకానంద జయంతిని పట్టణ బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సత్రం రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయ ఆడిటోరియంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు. జిల్లాలో రహీం బ్లడ్ డొనేషన్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు అబ్దుల్ రహీంను జిల్లా క్రీడలశాఖ అధికారి కీర్తిరాజ్‌వీర్ మెమెంటో బహూకరించి శాలువాతో సన్మానించారు.

తాండూర్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని అభినవ స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కిష్టంపేట, తంగళ్లపల్లి, తాండూర్ బస్టాండ్ ఏరియా ప్రాంతాల్లోని 25 పేద కుటుంబాలకు ఆదివారం బ్లాంకెట్స్‌ను ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సంతోష్‌కుమార్ అందజేశారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ధర్మారంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో వివేకానంద జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నస్పూర్: నివాళులర్పిస్తున్న నాయకులు



భీమారం: నివాళులర్పిస్తున్న యువకులు



చెన్నూర్ బీజేపీ కార్యాలయంలో...

గోత్రాలగూడెంలో 'పల్లెనిద్ర'



మాట్లాడుతున్న ఎస్సై శ్వేత

భీమారం: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి మండలంలోని కాజిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గోత్రాలగూడెంలో 'పల్లెనిద్ర' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్వేత మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నేరాలకు దూరంగా ఉండాలని కోరారు. గ్రామాలకు అపరిచిత వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఓటీపీలు చెప్పొందని సూచించారు. మహిళల రక్షణ కోసం పోలీస్‌శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టిందన్నారు. ఎలాంటి ఆపదలో ఉన్నా 100 నంబర్‌కు ఫోన్ చేయాలనికోరారు.

18న కాంట్రాక్ట్ కార్మికుల టోకెన్ సమ్మె

శ్రీరాంపూర్: జైపూర్ ఎస్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఇచ్చిన టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని హెచ్ఎమ్మెస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి, నాయకులు అశోక్, దుర్గం లక్ష్మణ్, రాజేంద్రప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. వేతనాలు, ఇతర సమస్యలపై జరిగే ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

నేడు గోదారంగనాథుల కల్యాణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట గోవింద క్షేత్రంలో సోమవారం గోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు కమాండెంట్ వెంకటరాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఎదుర్కోళ్ల వేడుక నిర్వహించగా సోమవారం ఉదయం 11గంటలకు గోదారంగనాథుల కల్యాణం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బోరిగం రాజారాం

శ్రీరాంపూర్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరు కాపులు సత్తా చాటాలని మున్నూరు కాపు కుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగం రాజారాం తెలిపారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో కులస్తుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులగణన ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కులస్తులందరు ఐక్యంగా ఉండి రాజకీయంగా రాణించాలన్నారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ మున్నూరు కాపు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పల్లె భూమేశ్, కుల సంఘం యూత్ జిల్లా అధ్యక్షుడు శ్రీపతి సురేశ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విలీన సభ విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

పాతమంచిర్యాల: దేశంలో బలమైన విప్లవ కార్మిక ఉద్యమం నిర్మించడంలో భాగంగా ఈ నెల 18న కొత్తగూడెంలో జరిగే ఐఎఫ్‌టీయూ విలీనసభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి టి.శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కార్యాలయంలో ఆదివారం విలీనసభ పోస్టర్ ఆవిష్కరించారు. సభకు ముఖ్య వక్తలుగా ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ, జాతీయ అధ్యక్షులు సాదినేని వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర అధ్యక్షులు అనురాధ, కార్యదర్శులు శ్రీనివాస్, జనార్దన్ హాజరవుతున్నారని, ఈ కార్యక్రమానికి కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు శ్రీనివాస్, బ్రహ్మానందం , దేవయ్య, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు–వేల గొంతుకలు' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కోటపల్లి: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా హైదరాబాద్‌లో వచ్చే నెల 7న నిర్వహించే లక్ష డప్పులు వేల గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. కోటపల్లి మండలకేంద్రంలో ఆదివారం మాదిగ పొలిటికల్ జేఏసీ ఏర్పాటు చేసి కన్వీనర్‌గా మంత్రి రామయ్యను ఎన్నుకొని ఎస్సీ వర్గీకరణ అంశంపై చర్చించారు. సుప్రీంకోర్టు తీర్పును తెలంగాణ రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను త్వరగా చేపట్టి మాట నిలబెట్టుకోవాలన్నారు. ఈ నెల 21న చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో వెయ్యి మందితో 500డప్పులతో కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మందకృష్ణ మాదిగను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, మాజీ జెడ్పీటీసీ తిరుపతి, మాజీ వైస్ ఎంపీపీ వేముల రాజన్న, భీమారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజుకుమార్, నాయకులు రేగుంట చంద్రశేఖర్, తుంగ రమేశ్, సారయ్య పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

భీమిని/మంచిర్యాలరూరల్(హాజీపూర్): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వక్తలు సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా భీమిని మండలంలోని చిన్నగుడిపేట గ్రామ యువకులకు క్రీడా సామగ్రిని ఎస్సై విజయ్‌కుమార్ పంపిణీ చేశారు. హాజీపూర్ మండలం ముల్కల్లలో స్వామి వివేకానంద జయంతి, సంక్రాంతి సందర్భంగా ముల్కల్ల గ్రామశాఖ ఆధ్వర్యంలో స్థానిక యువతకు నిర్వహించిన క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. విజేతలకు తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే, ఎస్సై గోపతి సురేశ్ ట్రోఫీ, నగదు పురస్కారం అందజేశారు. వేంపల్లిలో మాజీ ఎంపీటీసీ డేగ బాపు ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతి అందజేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): పట్టణంలోని చైతన్య హైస్కూల్‌లో 2003-04వ సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం రామకృష్ణాపూర్‌లోని సీవోపీ క్లబ్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. చదువు చెప్పిన గురువులను శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు.

ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం

- ఎమ్మెల్యే గడ్డం వినోద్



విజేతకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే వినోద్ దంపతులు

బెల్లంపల్లి: సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఏఎంసీ క్రీడా మైదానంలో ఆదివారం ముగ్గుల పోటీలు జరిగాయి. మహిళల నుంచి విశేష స్పందన లభించింది. మున్సిపాలిటీలోని 34వార్డుల నుంచి మహిళలు పాల్గొని ముగ్గులు వేసి అలరించారు. పోటీల్లో పిడుగు జయ ప్రథమ, మణి భార్గవి ద్వితీయ, పిడుగు లక్ష్మి తృతీయ బహుమతి గెలుచుకున్నారు. విజేతలుగా నిలిచిన మహిళలకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ దంపతులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. పండుగ వేడుకలు ప్రతీ ఇంట్లో వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని పేర్కొన్నారు. అందరికీ సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జె.శ్వేత, కౌన్సిలర్ బండి ప్రభాకర్, కాంగ్రెస్ శ్రేణులు, కుల, ప్రజా సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్/లక్సెట్టిపేట/నస్పూర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదివారం మంచిర్యాల పట్టణంలోని 5వ వార్డులో వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి అంజలి, రెండో బహుమతి సీహెచ్ అమర, మూడో బహుమతి ఎం.అరుణలు గెలుపొందారు. లక్సెట్టిపేట క్రిష్ణవేణి పాఠశాలలో విశ్వహిందు పరిషత్ ప్రఖండ వారి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. నస్పూర్ పట్టణ పరిధిలోని టీఎస్‌జీఓస్ కాలనీలో టీఎస్‌జీఓస్ సంఘం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.



నస్పూర్: బహుమతి అందజేస్తున్న నాయకులు

'పనులు చేయకుండా నిందలు వేస్తారా'

బెల్లంపల్లి: గ్రామ పంచాయతీ, స్వశక్తి సంఘాల భవనాలను సకాలంలో నిర్మించకుండా కాలయాపన చేసిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు తమపై నిందలు వేయడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అధికార ప్రతినిధి బత్తుల రవి, బెల్లంపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగతి సత్యనారాయణ అన్నారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు అనుసరించిన విధానాలు, నిర్దేశించిన కాలంలో పనులు పూర్తి చేయకపోవడం వల్ల ఏడాది కాలంపాటు వేచి చూసిన తర్వాతనే నిధులు మళ్లించినట్లు తెలిపారు. ఈ విషయంలో మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు ముత్తే భూమయ్య, మొండి, డి.సురేష్, దామోదర్ గౌడ్, జాడి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థ బలోపేతంతో ఉద్యోగావకాశాలు



జాబ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బీఎస్‌రావు

మంచిర్యాలఅర్బన్: గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంతోనే ఉద్యోగ అవకాశాలు ఏర్పడుతాయని బీఎస్‌రావు వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి బీఎస్ రావు అన్నారు. మంచిర్యాలలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే ఉద్యోగాలు కల్పించే అంశాలపై ఆదివారం జాబు క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ ఉత్పత్తులు పెంచటం, అనుకూలమైన వ్యాపార వాతావరణాన్ని పెంపొందించటంతో నిరుద్యోగాన్ని తగ్గించవచ్చన్నారు. సమావేశంలో ఐఎంఏ కార్యదర్శి మూర్తి, న్యాయవాది కర్రె లచ్చన్న, సభ్యులు జయరావు, దొమ్మెటి అర్జున్, బేర ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


'డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో అవకతవకలు'

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జంగిలి రవీందర్ ఆరోపించారు. పట్టణంలోని టీబీజీకేఎస్ ఆఫీస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంటనే అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నస్పూర్: పట్టణ రెడ్డి పరివార్ సంక్షేమ సంఘం 2025నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఇటీవల నియమించబడిన నూతన కమిటీని పరిచయం చేశారు. కార్యక్రమంలో పట్టణ గౌరవ అధ్యక్షుడు అనుమాండ్ల వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు మోతె రాఘవ రెడ్డి, జిల్లా కార్యదర్శి గొట్టం తిరుపతి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దూదిపాల విజయ్‌పాల్‌రెడ్డి, గౌరవ సలహాదారులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

దొనబండ విద్యార్థినికి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న నిహారిక

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జాతీయ యువజన దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో దొనబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థిని గుడెల్లి నిహారిక ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా చేతుల మీదుగా పురస్కారం అందుకుంది. ఇటీవల కర్ణాటకలో దక్షిణ భారతదేశ వ్యాప్తంగా జరిగిన ఎన్‌సీసీ జాతీయ స్థాయి శిబిరంలో నిర్వహించిన షూటింగ్ విభాగంలో ప్రథమ స్థానం సాధించినందుకు ఈ పురస్కారం లభించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు, ఎన్‌సీసీ అధికారి ఆనందరావు, ఉపాధ్యాయులు నిహారికను ప్రత్యేకంగా అభినందించారు.